క్లుప్తంగా

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంటాపురం నుంచి నాగసానిపల్లి వరకు రూ.86 లక్షల ఎంఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్డు రెన్యూవల్‌కు గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్‌లు నాగన్న, ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, పీఆర్ఏఈ రమేష్‌నాయుడు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం



దేవరకద్ర రూరల్: పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బస్వాయపల్లి, గోపన్‌పల్లిలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించబడిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రతి పంచాయతీలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానాలు, ప్లాంటేషన్, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలతో పాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తూ, వార్షిక ఆడిట్లను కూడా ఆన్‌లైన్‌లో చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బస్వాయపల్లిలో ముదిరాజ్, వాల్మీకి కమిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్వాయపల్లి నుంచి వేముల వరకు మట్టి రోడ్డు వేసేందుకు భూమి పూజ చేశారు. గోపన్‌పల్లిలో వాల్మీకి కమిటీ హాల్‌ను ప్రారంభించడంతో పాటు యాదవ కమిటీ హాల్, ఆరోగ్య ఉప కేంద్రం, ఎస్సీ కమిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పంచాయతీ సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జెట్టి నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కోయిల్‌కొండ: వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. గురువారం ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి బోయశ్రీనివాసులు ఆదేశానుసారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి పాల్గొని మాట్లాడారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్, బాల కార్మిక చట్టాలు, సీనియర్ సిటిజన్, వ్యవసాయకార్మిక చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రజలు తప్పకుండా ఈశ్రమ్ బీమా పాలసీని నమోదు చేసుకోవాలని సూచించారు. అగ్రి లీగల్‌ఎడ్ క్లినిక్‌ను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, న్యాయవాది రాజేష్, వ్యవసాయాధికారి రాంపాల్, వైస్‌ఎంపీపీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘంలో సభ్యత్వానికి రూ.70 వేల డిమాండ్



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మత్స్యకారులు కొంతకాలం కిందట కొంత మంది మాత్రమే మత్స్య సహకార సంఘం పేరుతో ఒక సంఘం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మరికొంత మంది సంఘంలో చేరాలని సంవత్సరం నుంచి ఆసక్తి చూపుతుండగా.. ఒక్కొక్కరు రూ.70 వేలు కట్టాలని పాత సంఘం వారు డిమాండ్ చేస్తున్నారు. కొత్త సభ్యత్వాలకు ఆధార్‌కార్డు నంబర్ ఇచ్చి సంఘంలో చేరవచ్చని, ప్రభుత్వ చెరువులో అందరూ సమభాగ్యులే అని నాగర్‌కర్నూల్ జిల్లా ఏడీ లక్ష్మప్ప తెలియజేశారని అన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని, పెంట్లవెల్లి తెలుగు సంఘం మత్స్యకారులు రవి, కురుమయ్య, రేణు, మహేష్, కిశోర్, శ్రీకాంత్ తదితర మత్స్యకారులు అధికారులను కోరుతున్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కొల్లాపూర్: ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను పెంచడాన్ని స్వాగతిస్తూ.. వారు ఈ కార్యక్రమం చేపట్టారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాశన్న, బాలస్వామి, మాధవి, సలీమ్, శేఖర్, చిన్నమ్మ, ఈశ్వరమ్మ, లింగమ్మ, వెంకటస్వామి, శివశంకర్ తదితరులున్నారు.



ఖిల్లాఘనపురంలో..



చెన్నారంలో..



శాగాపూర్‌లో..

‘పల్లెప్రగతి’తో గ్రామాల అభివృద్ధి

ఆత్మకూర్: పల్లెలు ప్రగతిలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ దిశగా అడుగులు వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని అధికారులు, సర్పంచ్‌లు అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో సర్పంచ్‌లు జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త ద్వారా తయారు చేసిన సేంద్రియ ఎరువులను రైతులకు అందజేశారు. కార్మికులకు నూతన వస్త్రాలు, ప్రశంసపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. జగత్‌పల్లిలో ఏర్పాటు చేసిన పల్లెప్రగతి కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ అఫ్జల్ పాల్గొని కార్మికులను సన్మానించారు. పంచాయతీ కార్మికులకు కొత్త బట్టలు, సబ్బులు, నూనె, గ్లౌజులు, బూట్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంత, ఎంపీటీసీ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లెల్లో ర్యాలీలు చేయడంతో పాటు పంచాయతీ కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి పంచాయతీ కార్మికుల సన్మానించారు.



అప్పారెడ్డిపల్లిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

గోపాల్‌పేట: మండలంలో గురువారం పల్లెప్రగతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ర్యాలీలు నిర్వహించి, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. మండలంలోని చెన్నారంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పది సంఖ్య ఆకారంలో కూర్చొని ప్రదర్శన చేశారు. ఏదులలో ర్యాలీ నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉదయం నుంచి జాతీయ పతాక ఆవిష్కరణ చేయడంతో పాటుగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్రంలో గ్రామాలు సాధించిన ప్రగతిని పంచాయతీ కార్యదర్శులు చదివి ప్రజలకు వివరించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడంతో పాటుగా వారికి కొత్త బట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లితండాలో..



కత్తేపల్లిలో..



గుంటిపల్లిలో..



జగత్‌పల్లిలో..

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహాల ఊరేగింపు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో ఊరేగించి చెరువు దగ్గరకు తీసుకెళ్లి గంగ పూజ, తెప్పోత్సవం చేశారు. ఊరేగింపులో భాగంగా కేరళ నుంచి వచ్చిన కళాకారులు పలు దేవతామూర్తుల వేషధారణలు, వాయిద్యాలతో అలరించారు. చెరువు సమీపంలోనే అన్నదానం నిర్వహించారు. గురువారంతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ముగిశాయని దేవాలయ కమిటీ వారు తెలిపారు.



దేవతల రూపంలో కేరళ కళాకారులు



అమ్మవారి ఊరేగింపులో గంగపుత్రులు

‘ప్రజాదరణ ముందు అధికార బలం నిలబడదు’



మాట్లాడుతున్న నాయకులు

కొత్తకోట రూరల్: ప్రజాదరణ ముందు అధికారం బలం నిలబడదని కౌన్సిలర్లు బహ్మంఆచారి, వెంకటేష్, రాధాకృష్ణ అన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎంపీపీ మేఘారెడ్డి రాత్రింబవళ్లు కష్టపడి పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ నిర్మాణాన్ని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే ముందే పూర్తి చేసి మండలాన్ని సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. పనులు మేఘారెడ్డి చేస్తే నీళ్ల నిరంజన్‌రెడ్డి అని మంత్రి పిలిపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎదుటి వారిని విమర్శించే ముందు నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎన్నిసార్లు ఓడిపోయారో బీఆర్ఎస్ నాయకులు తెలుసుకుంటే మంచిదని హితువు పలికారు. వనపర్తిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడాన్ని అధికార పార్టీ నాయకులు జీర్ణించుకోవట్లేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని జోస్యం చెప్పారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ చక్రపాణి

పాన్‌గల్: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడం, ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులపై గ్రామాల్లో అవగాహన పెంచాలని తహసీల్దార్ చక్రపాణి బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ ఆదేశానుసారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల ఓటరు జాబితాలను పరిశీలిస్తూ అందులో మార్పులు, చేర్పుల అంశాలు, ఒక కుటుంబం యొక్క అన్ని ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఓటరు కార్డుకు తప్పకుండా ఆధార్ అనుసంధానించాలన్నారు. విధుల పట్ల బీఎల్‌ఓలు అలసత్వం వహిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్ పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు

కొల్లాపూర్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో గురువారం ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడుతాయన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఏర్పాటు చేసిన అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పలుకలు అందజేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన నర్సింహ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ హరిచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుండటంతోనే బడులపై నమ్మకం పెరిగిందని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేష్‌యాదవ్ అన్నారు. గురువారం గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి సంపత్ ఒకటవ తరగతి, నవీన్ రెండో తరగతి, సంజయ్ నాల్గో తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, దుస్తులు, నాణ్యమైన భోజనం అందిస్తూ ప్రైవేటుకు దీటుగా విద్య బోధిస్తున్నారని తెలిపారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

పెబ్బేరు: మండలంలో కొత్త సూగూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తుందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మోజర్ల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో సింగిరెడ్డి వాసంతి



వెంగళాయిపల్లిలో..



సూగూర్‌లో పాఠశాలలో..

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లాఘనపురం: అనుమతులు లేకుండా నడుపుతున్న, పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ ఆనంద్ అన్నారు. గురువారం ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికి ఒకటి చొప్పున పుట్టగొడుగుల్లా వస్తున్న అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు దోచుకుంటున్నాయని ఆరోపించారు. కొందరు పాఠశాలల యాజమాన్యం పాఠ్య పుస్తకాలను సైతం విక్రయిస్తు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మండల విద్యాధికారి వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, రవి, మహేష, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



స్మృతిలయను సన్మానిస్తున్న పలుస శంకర్‌గౌడ్

వనపర్తి టౌన్: జిల్లాకు చెందిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి దేశ, విదేశాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించి వనపర్తికి గుర్తింపు తీసుకురావాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు 696 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 366వ ర్యాంక్ సాధించిన స్మృతిలయను సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని విద్యార్థిని ఇంట్లో శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు జీవితంలో ఉన్నతంగా ఎదిగితే తల్లిదండ్రులకు వచ్చే ఆనందం, గౌరవం మరేదాంట్లో ఉండదన్నారు. కష్టపడి పట్టుదలతో చదివితే సాధించలేనిదంటూ ఏది ఉండదని, అందుకు నిదర్శంగా స్మృతిలయ నిలిచిందన్నారు. ఈ మేరకు స్మృతిలయ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ అయ్యాకా.. పేదలకు సేవ చేయడమే తన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, మద్దిలేటి, కళావేదిక ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, సత్తార్, బైరోజు చంద్రశేఖర్, రాములు, బండారు శ్రీనివాసులు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి అంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ పతాకం ఎగుర వేసి సంబురాలను జరుపుకోవడం వింతగా ఉందన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చలేని పాలకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓవర్ హెడ్‌ట్యాంకులను నెలకు ఒకసారైనా శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్, శంకర్, నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రనాయక్ తండాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

మండలంలోని చంద్రనాయక్‌తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నెల రోజుల నుండి వీధి దీపాలు వెలగడం లేదని, కరెంటు స్తంభాలు నేల కొరుగుతున్నాయని వాపోయారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగుతున్నాయని, మిషన్ భగీరథ పైపులు పగిలినా వాటికి మరమ్మతు చేపట్టడం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమంత్ నాయక్, నాగునాయక్, సోమ్లానాయక్, హరీష్ నాయక్, బొజ్జనాయక్, లింగనాయక్, కృష్ణనాయక్, భాగ్యనాయక్ పాల్గొన్నారు.



చంద్రప్పతండాలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్లాస్టిక్ వాడితే చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పురపాలిక కార్యాలయంలో మటన్, చికెన్, కూరగాయలు, పండ్ల వ్యాపారులతో సమావేశమయ్యారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం అధికం అయిందని, దీని కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో ఎన్నో రకాల అనర్థాలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మటన్, చికెన్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడే పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని మండిపడ్డారు. వ్యర్థాలను చెత్తబండ్లకే ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

నేడు పట్టణ ప్రగతి..

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ, ముగ్గుల పోటీలు, ప్రగతి నివేదిక, ర్యాలీ, కార్మికులకు సన్మానం తదితర కార్యక్రమాలు శుక్రవారం చేపడుతున్నామని, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని చైర్‌పర్సన్ గాయత్రి కోరారు.

జమ్ములమ్మ గుడి దారిని మూసివేయడం సరికాదు

వనపర్తి: కొత్త మున్సిపాలిటీ భవనం పక్కన ఉండాల్సిన జమ్ములమ్మ గుడికి దారి యదావిధిగా ఉండాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. గురువారం దారికి అడ్డంగా మున్సిపల్ అధికారులు చేస్తున్న నిర్మాణం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల క్రితం నుంచి అమ్మవారి గుడికి ఉన్న దారిని మూసివేస్తూ.. వాస్తు పేరిట మున్సిపల్ కార్యాలయం పక్కన ప్రహరీ నిర్మించడంపై భక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఈ విషయంలో మొండిగా వ్యవహరిస్తూ.. అమ్మవారి ఆలయ దారిని మూసివేసేందుకు ప్రయత్నం చేయటం సరికాదని, ఈ విషయంలో మున్సిపల్ పాలకవర్గం పునరాలోచించకుంటే.. కాలనీవాసులతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధం



దగ్ధమైన గడ్డివామును చూపుతున్న రైతు వెంకట్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల గడ్డి వాములు, పైపులు దగ్ధమైన ఘటన పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిట్యాల వెంకట్‌రెడ్డి పొలం సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా నిప్పులు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న వెంకట్‌రెడ్డికి సంబంధించిన గడ్డివాములు, పశువుల పాకకు మంటలు వ్యాపించడంతో పశువులకు కాలిన గాయాలయ్యాయి. గడ్డివాముతో సమీపంలో ఉంచిన స్ప్రింక్లర్ పైపులు, మోటారు వైర్లు బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు వేడుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

అడ్డాకుల: మండలంలోని చిన్న మునుగల్‌ఛేడ్ చెందిన మన్నెమ్మ కుమార్తె జ్యోతికి వివాహం కావడంతో కల్యాణలక్ష్మి ద్వారా మంజూరైన చెక్కును గురువారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. కల్యాణలక్ష్మి ద్వారా నిరుపేద యువతుల వివాహాలకు సీఎం కేసీఆర్ సాయం అందించి ఆదుకుంటున్నారని ఆయన తెలిపారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన ఇమ్మానుయేల్ చనిపోవడంతో మృతుని కుటుంబానికి రూ.5వేలను పంపించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జయన్నగౌడ్, ఖాజాఘోరీ, అనురాధ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.